క్లుప్తంగా

అచ్చమాంబకు విశేష పూజలు


అచ్చమాంబ సన్నిధిలో మద్యం ముట్టబోమని ప్రమాణాలు చేయిస్తున్న ఆలయ పూజారి వెంకటేశ్వర్లు

మర్రిపాడు(ఆత్మకూరురూరల్‌): మర్రిపాడు–కంద్రిక మధ్యలో పొంగూరు మాలిచేలు ప్రాంతంలో కొలువైన అచ్చమాంబ దేవాలయంలో ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మద్యానికి బానిసైన వ్యక్తులను వారి కుటుంబ సభ్యులు అమ్మవారి సన్నిధికి తీసుకొచ్చి ఆలయ పూజారి పాశర్ల పూడి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఆకుపసరు ఇప్పించి భవిష్యత్‌లో మద్యం ముట్టబోమని ప్రమాణాలు చేయించారు.

పార్కింగ్‌ టైల్స్‌ ఏర్పాటు


సిమెంట్‌ బల్లలు ఏర్పాటు చేసిన దృశ్యం

ఉదయగిరి: స్థానిక మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణంలో ఎంపీపీ మూలే పద్మజా, ఆమె భర్త మూలే వినయరెడ్డి కార్యాలయానికి వచ్చే కార్యకర్తల సౌకర్యార్థం నూతనంగా పార్కింగ్‌ టైల్స్‌తో పాటు సిమెంట్‌ బల్లలు ఏర్పాటు చేశారు. తమ సొంత నిధులతో వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కొనసాగుతున్న సామాజిక తనిఖీ

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలంలోని దేవరాయపల్లి బిట్‌–1, ఇస్కపల్లి, బెడుసుపల్లి గ్రామాల్లో ఆదివారం ఉపాధిహామీ పథకం కింద సామాజిక తనిఖీ, గ్రామసభలు నిర్వహించారు. డీఆర్పీలు అక్కడ రికార్డు పరిశీలన, క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన, కూలీలకు పనులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ దయాసాగర్‌ పాల్గొన్నారు.

బాడీబిల్డింగ్‌ పోటీలను విజయవంతం చేయండి

కావలి: పట్టణంలో ఈ నెల 21న బాడీబిల్డింగ్‌ పోటీలను నిర్వహిస్తునట్లు నిర్వాహకులు ఆదివారం తెలియజేశారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 200 మంది వరకు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. కావలి పీపీహెచ్‌ఆర్‌ఆర్‌ కల్యాణ మండపంలో ఈ పోటీలను జరుతున్నాయన్నారు. ఈ పోటీల్లో బాడీబిల్డర్‌ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేసవి శిబిరాలు విజ్ఞానదాయకం


ఆత్మకూరు జెడ్పీ బాలికల పాఠశాల విద్యార్థినులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా వారిలో విజ్ఞానం పెంపొందించేలా ఆత్మకూరు గ్రంథాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్‌ ఓంకారం రాజు తెలిపాడు. పట్టణంలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఆదివారం లైబ్రరీలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయిని పలు విజ్ఞానదాయక పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. రోజుకొక పాఠశాల చొప్పున నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ అసిస్టెంట్‌ తనూజ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాఖాహారంపై అవగాహనా ర్యాలీ


అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పక్షం రోజులుగా జరుగుతున్న ధ్యాన, జ్ఞాన, మహాయజ్ఞం శిక్షణా తరగతుల్లో భాగంగా పిరమిడ్‌ ఆధ్వర్యంలో ఆదివారం ధ్యానులు పురవీధుల్లో నినాదాలతో శాఖాహారంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఉన్నత పాఠశాల్లో తిరుపతికి చెందిన సీనియర్‌ పిరమిడ్‌ మాస్టర్‌ మోక్ష ధ్యానం, శాఖాహారంపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు ధ్యానాన్ని అలవర్చుకోవాలన్నారు. ధ్యానం వల్ల ఎన్నో ఆరోగ్యకర ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, దేవేందర్‌, సౌభాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


దీసీపల్లి అభయాంజనేయస్వామి దేవాలయంలో సువర్చల, హనుమంతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


ఉదయగిరి: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి


వరికుంటపాడు: ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సంగం: విశేష అలంకారంలో అభయాంజనేయస్వామి

భక్తిశ్రద్ధలతో హనుమత్‌ జయంతి

కావలి: పట్టణంలోని మద్దూరుపాడులో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమత్‌ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమత్‌ జయంతి వేడుకలు పురస్కరించుకుని ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు ఆలయంలో ప్రతి రోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం హనుమత్‌ జయంతి సందర్భంగా వేకువ నుంచే అంజనీ పుత్రుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దీవి రమేషాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం నిత్యహోమం, విశ్వక్సేన పూజ, పంచామృత అభిషేకం, సహస్రనామార్చనలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు. సాయంత్రం ప్రత్యేక అలంకరణ, నిత్యహోమాలు నిర్వహించి సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రికి హనుమంతుడికి ఒంటె వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులందరికీ మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

నేత్రపర్వంగా హనుమజ్జయంతి వేడుకలు

కావలి రూరల్‌: మండలంలోని పలు గ్రామాల్లో హనుమత్‌ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు హనుమాన్‌ విగ్రహాల వద్ద సుందరంగా అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. తుమ్మలపెంట, మద్దూరుపాడు, ముసునూరు, కొత్తపల్లి, ఆముదాలదిన్నె గ్రామాల్లో భక్తులతో ర్యాలీ నిర్వహించారు. భక్తులు ఆలయాల వద్దకు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా హనుమాన్‌ జయంతి

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో హనుమత్‌ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని తూర్పుబోయమడుగుల, విరువూరు, వరికుంటపాడు, రామాపురం గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు వేకువ జామునుండే స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరికుంటపాడులో హనుమంతుడి శోభాయాత్రలో భాగంగా భక్తులు బైక్‌ ర్యాలీ నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని పలుగ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని ఎర్రబల్లిగడ్డ, ఉదయగిరి, దుర్గంపిల్ల సమీపంలోని హనుమాన్‌ నాలా ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో వేడుకలు జరిగాయి. భక్తులు వేకువజాము నుండే ఆలయాలకు చేరుకుని పూజలు, అర్చనలు చేసుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. హనుమాను నాలా వద్ద భక్త జనసందోహం నెలకొంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేత్రపర్వం హనుమజ్జయంతి

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలో ఆదివారం హనుమజ్జయంతిని భక్తులు భక్తిశ్రద్ధతో నిర్వహించారు. అనంతసాగరం, రేవూరు, సోమశిల, ఉప్పలపాడు ముస్తాపురం తదితర గ్రామాల్లో వేకువ జాము నుంచే భక్తులు ఆంజనేయస్వామి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఊరుబిండి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

ఉప్పలపాడులో ఉన్న సీతారాముల ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి అమ్మవార్లకు కొలువుదీర్చారు. అర్చకులు సంప్రదాయాన్ని అనుసరించి కన్యాదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కల్యాణాన్ని శుభ ముహూర్తంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీరామ స్మరణ చేస్తూ కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

భక్తిప్రపత్తులతో హనుమజ్జయంతి

మర్రిపాడు (ఆత్మకూరురూరల్‌): హనుమాన్‌ జయంతిని పురస్కరించుకుని ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం భక్తజనం ఆంజనేయస్వామి దేవాలయాల్లో విశేష పూజలు, అర్చనలు నిర్వహించిన నీరాజనాలు పలికారు. ఆత్మకూరు మండలంలోని మహిమలూరు, దేపూరు, మురగళ్ల, నల్లపరెడ్డిపల్లి, వాశిలి, కరటంపాడు, గండ్లవేడు, బోయలచిరివెళ్ల, బట్టేపాడు తదితర గ్రామాల్లో అభయాంజనేయస్వామి విగ్రహాల వద్ద విశేష పూజల అనంతరం అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మర్రిపాడు మండలంలోని డీసీపల్లి, నెర్ధనంపాడు, బ్రాహ్మణపల్లి, చిలకపాడు, మర్రిపాడు, చుంచులూరు, నందవరం, పొంగూరు, కేతిగుంట తదితర గ్రామాల్లో హనుమాన్‌ జయంతి వేడుకలను భక్తులు కోలాహలంగా నిర్వహించారు. సువర్చల, హనుమంతుడి కల్యాణోత్సవాలు నిర్వహించి అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలోనూ భక్తజనం అధిక సంఖ్యలో ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్‌ జయంతి

సంగం: స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్‌ జయంతి వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో న్విహించారు. స్వామి వారిని పరిమళ పుష్పాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని జంగాలదొరువులోని అంజనేయస్వామి ఆలయంలో హనుమాన్‌ జయంతి సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహించారు.

ఘనంగా హనుమజ్జయంతి

చేజర్ల: మండలంలోని హనమజ్జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చేజర్ల, నాగుల వెలటూరు, కాకివాయి, యనమదల, మడపల్లి, ఆదూరుపల్లి గ్రామాల్లో హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మడపల్లి కోదండరామస్వామి గుడిలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. చేజర్లలో అభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. తమలపాకులతో సహస్రనామ పూజలు చేశారు. అనంతరం 700 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సొసైటీ అధ్యక్షుడు భూదర్ల వీరరాఘవరెడ్డి, విజయ దంపతులు, ఆత్మకూరు వెంకటేశ్వర్లు, ప్రశాంతి, దొరస్వామిరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, దామోదర్‌ రెడ్డి, ప్రకాశ్‌ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కలిగిరిలో..

కలిగిరి: మండలంలో ఆదివారం హనుమాన్‌ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలిగిరిలోని పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో ఆంజనేయస్వామి ఆలయం, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆంజనేయస్వామి విగ్రహం, జిర్రావారిపాళెంలోని అభయాంజనేయస్వామి విగ్రహం, కమ్మవారిపాళెంలో ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్‌ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

హనుమాన్‌ జయంతి వేడుకలు

దుత్తలూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాలు, విగ్రహాల వద్ద ఆదివారం హనుమాన్‌ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రసిద్ధ వెంకటంపేట వీరాంజనేయస్వామి వారికి అభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

ఆత్మకూరు బైపాస్‌ రోడ్డు అభయాంజనేయస్వామి ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


వైభవంగా హనుమ కల్యాణం

• భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు • భారీ స్థాయిలో అన్నదానం

ఆత్మకూరు: శ్రీరామభక్తుడు అభయాంజనేయస్వామి జన్మదినం సందర్భంగా పట్టణంలోని పలు రామాలయాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. బైపాస్‌రోడ్డు, నెల్లూరు–ముంబయి రహదారి కూడలిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆర్యవైశ్యులు నిర్మించిన కోదండ రామాలయంలో, సుందరమ్మ కోదండ రామాలయంలో, అలఘనాథస్వామి ఆలయంలో, పంటవీధి రామాలయాల్లో ఆంజనేయస్వామి వారి విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. బైపాస్‌ రోడ్డులోని ఆలయంలో వేకువజామున స్వామివారి మూల విరాట్టుకు పంచామృతాభిషేకం, అనంతరం తమలపాకులతో సహస్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. భక్తులతో సామూహికంగా హనుమాన్‌ చాలీసా పారాయణం చేశారు. పట్టణంలోని పంటవీధి రామాలయం నుంచి హనుమత్‌ దీక్ష తీసుకున్న స్వాములు ఇరుముడులు తలపై పెట్టుకుని బైపాస్‌రోడ్డులోని ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. దారి పొడవునా వారికి ప్రజలకు పుష్పాలతో స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న శోభాయాత్ర అనంతరం ఇరుముడులు స్వామి వారికి చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆంజనేయస్వామి సమేత సువర్చలాదేవి కల్యాణం శాస్త్రోక్తంగా అర్చకులు నిర్వహించారు. భారీ స్థాయిలో అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 60 అడుగుల భారీ ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక ఏర్పాట్లతో పాలాభిషేకం నిర్వహించారు. రాత్రి ఆలయ ప్రాంగణంలోనే పల్లకిసేవ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భక్తులచే పండరీ భజన నిర్వహించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణంలోని పలు రామాలయాల్లో ఆంజనేయస్వామి వారికి ఆకు పూజలు, సింధూర పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయాల్లోని పూజల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కలిగిరి: జిర్రావారిపాళెంలో అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


చేజర్ల: అభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం


దుత్తలూరు: వెంకటంపేటలో ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి


కావలి: మద్దూరుపాడు ఆలయం వద్ద భక్తులు


చేజర్ల: ఉప్పలపాడులో జరుగుతున్న సీతారాముల కల్యాణం

వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న బీద మస్తాన్‌రావు, ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• రాజ్యసభ సభ్యుడు మస్తాన్‌రావు, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు

అల్లూరు: మండలంలోని ఇస్కపల్లి పంచాయతీ ఇస్కపల్లిపాళెం, చంద్రబాబునగర్‌ కాలనీలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో శనివారం రాత్రి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. 2024 ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజాలను నిర్వహించారు. అనంతరం ఇస్కపల్లిపాళెంలో పదో తరగతి, ఇంటర్‌ ఫలితాల్లో ఉత్తమ మార్కులను సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా గణేష్‌ నృత్య ప్రదర్శన చేసిన విశాఖపట్నం టీం కళాకారులకు రూ.10 వేల బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, జెడ్పీటీసీ వీణమ్మ, సర్పంచ్‌ రంజిత్‌, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు దండా కృష్ణారెడ్డి, బీద రమేష్‌, కొండూరు వాసు, రాజేష్‌, దేవరాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం

ఆత్మకూరు: అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయంలో వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాతృ దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. తల్లిలేనిదే జననం లేదని, గమనం లేదని, అసలు సృష్టే ఉండదని, అలాంటి తల్లిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని నిర్వాహకులు పేర్కొన్నారు. అనంతరం పలువురు తల్లులను ఘనంగా సన్మానించారు. విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులను పూజిస్తూ వారి దీవెనలు అందుకోవాలని సూచించారు. స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం నిర్వాహకులు కె.అపర్ణ, కేవీ చక్రవర్తి, డిగ్రీ కళాశాల అధ్యాపకుడు చంద్ర, పలువురు మహిళలు పాల్గొన్నారు.


మహిళను సన్మానిస్తున్న దృశ్యం

కొని తెచ్చుకునే నష్టం

పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్న ప్లాస్టిక్‌ వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. ప్రజల అవగాహన రాహిత్యం, అధికారుల పర్యవేక్షణ కొరవడిన కారణంగా ప్లాస్టిక్‌ వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. ఫలితంగా ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్‌ వ్యర్థాలు గుట్టలు గుట్టలుగా పెరిగి పర్యావరణానికి ముప్పు అనివార్యమవుతోంది.


ఇళ్ల మధ్య ప్లాస్టిక్‌ వ్యర్థాలు

• యథేచ్ఛగా ప్లాస్టిక్‌ వినియోగం
• ప్లాస్టిక్‌ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు
• కొరవడిన అధికారుల పర్యవేక్షణ

అల్లూరు: ప్లాస్టిక్‌ కవర్ల వినియోగం నగరాలు, పట్టణాలను దాటి పచ్చని పల్లెలకు పాకింది. అల్లూరు మండలంలో ప్లాస్టిక్‌ కవర్లు, క్యారీ బ్యాగుల అమ్మకాలు నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా సాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ అప్పుడప్పుడు తూతూ మంత్రంగా ఉండడంతో ఈ వ్యాపారం అడ్డూ అదుపూ లేకుండా సాగుతోంది. 40 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న క్యారీ బ్యాగులు తదితరాలను ఉపయోగించరాదని నిబంధనలు ఉన్న అవి ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు.

హోటళ్ల దుకాణాల్లో అధిక వాడకం

40 మైక్రాన్న కంటే తక్కువ ఉన్న క్యారీ బ్యాగులు, కవర్లు వినియోగించరాదని నిబంధన ఉన్నా వీటి వాడకం విచ్చలవిడిగా సాగుతోంది. మార్కెట్‌లో తేలికగా బహిరంగంగా దొరుకుతుండటంతో చిన్న చిన్న హోటళ్లు, దుకాణాల్లో వీటి వాడకం అధికంగా ఉంది. హోటళ్లలో ప్లేట్లలో ఆకులకు బదులు ప్లాస్టిక్‌ పేపర్లు వాడుతుండటంతో వేడి ఆహార పదార్థాలు వేసినప్పుడు ప్లాస్టిక్‌ పేపర్‌లో కరిగిపోయి శరీరానికి చేరుతుందని, దీంతో అనారోగ్యం పాలవుతున్నారని డాక్టర్లు చెబుతున్నారు. పలు రకాల క్యాన్సర్లు, అల్సర్లు, గ్యాస్ట్రిక్‌ సమస్యలు ప్లాస్టిక్‌ వాడకం కారణంగానే వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. హోటళ్లు, దుకాణాలే కాక ఏ వ్యాపారంలోనైనా ప్లాస్టిక్‌ వాడకం సర్వసాధారణం కావడంతో సమస్య నానాటికీ తీవ్రమవుతోంది.

పర్యావరణానికి ముప్పు

విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ వినియోగం కారణంగా పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. వివాహాది శుభకార్యాల్లో కూడా ప్లాస్టిక్‌ ప్లేట్లు, గ్లాసులు అధికంగా వాడుతుండడంతో ప్రమాద తీవ్రత మరింత పెరుగుతున్నట్లు చెబుతున్నారు. వాడి పడేసిన ప్లాస్టిక్‌ వ్యర్థాలు రోడ్ల వెంబడి, వీధుల్లో గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. ప్లాస్టిక్‌ ప్లేట్లు, కవర్లు తిని మూగజీవాలు సైతం మత్యువాత పడుతున్నాయి.


బస్టాండ్‌ సెంటర్‌ ఆవరణలో కుప్పలు కుప్పగులుగా పడున్న ప్లాస్టిక్‌ వ్యర్థాలు

అవగాహన కల్పించాలి



ప్లాస్టిక్‌ వినియోగం కారణంగా ప్రజలకు కలిగే నష్టాలు, వచ్చే ఆరోగ్య సమస్యలు, పర్యావరణానికి కలిగే హాని గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. తద్వారా ప్లాస్టిక్‌ వాడకాన్ని తగ్గించ వచ్చు. ప్రజలను చైతన్యవంతం చేసేందుకు మేము కూడా మా వంతు కృషి చేస్తాం.

– కొప్పు శ్రీనివాసులు, విశ్రాంత ఉపాధ్యాయుడు, అల్లూరు

ప్లాస్టిక్‌తో క్యాన్సర్‌లు



ప్లాస్టిక్‌ వినియోం కారణంగా ప్రజలకు పలు రకాల క్యాన్సర్లు వస్తాయి. అల్సర్లు, గ్యాస్ట్రిక్‌ సమస్యలు తదితర జీర్ణకోశ వ్యాధులు వస్తాయి. ప్లాస్టిక్‌ వాడకాన్ని వీలైనంతగా తగ్గించుకోవాలి. ప్లాస్టిక్‌ వాడకం వల్ల కలిగే నష్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి.

– బత్తల సుధాకర్‌, స్థానికుడు, అల్లూరు